96.9 శాతం సర్వే చేశాం

- కులగణన సర్వేను సంక్షేమం కోసం ఉపయోగిస్తాం
- జీహెచ్ఎంసీ పరిధిలోనే అధిక కుటుంబాలు మిగిలిపోయాయి
- సర్వేలో పాల్గొన్న లక్ష మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో తాము చేపట్టిన కుల గణన సర్వే నివేదికను ప్రజల సంక్షేమం కోసం ఉపయోగిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. శాసనసభలో మంగళవారం ఆయన కుల గణన నివేదికను ప్రవేశపెట్టి ప్రసంగించారు. రాష్ట్రంలో 46.25 శాతం బీసీలు ఉన్నారని, మైనార్టీల్లోని 10.08 శాతం మంది బీసీలను కూడా కలుపుకొని మొత్తం 56.33 శాతం మందికి సముచిత గౌరవం కల్పిస్తామని చెప్పారు. గత 75 ఏండ్లుగా బీసీల వివరాలు, లెక్కలులేవని, ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో సామాజిక కుల సర్వేను నిర్వహించామని సీఎం వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో న్యాయస్థానాల ముందు ఈ ప్రక్రియ నిలవకపోవడంతో అలాంటి తప్పిదం జరగొద్దని, సర్వేను పకడ్బందీగా నిర్వహించామని తెలిపారు. తమ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత 2024 ఫిబ్రవరి 4న జరిగిన మంత్రివర్గ సమావేశంలో సామాజిక సర్వే నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. ఏడాది తర్వాత మళ్లీ ఫిబ్రవరి 4న సర్వే నివేదికను సభలో ప్రవేశపెట్టామని అన్నారు. సర్వే పర్యవేక్షణకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేశామని, కర్ణాటక, బీహార్‌లో జరిగిన సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేశామని చెప్పారు. సర్వే నిర్వహణ కోసం 1.03 లక్షల మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు. నవంబర్ 6 నుంచి డిసెంబర్ 25 వరకు సర్వేను నిర్వహించామని, గ్రామీణ ప్రాంతాల్లో 66.99 లక్షలు, నగరాల్లో 45.15 లక్షల చొప్పున మొత్తం 1.12 కోట్ల కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయని తెలిపారు. మొత్తం 1.15కోట్ల కుటుంబాలకు గాను 1.12కోట్ల కుటుంబాలను సర్వేచేశామని, సర్వే కవరేజీశాతం 96.9 శాతంగా నమోదయ్యిందని చెప్పారు. వివిధ కారణాలతో 3,56,323 కుటుంబాలను సర్వేచేయలేదని, ఆ కుటుంబాలు జీహెచ్ఎంసీలోనే అధికంగా ఉన్నాయని అన్నారు. మొత్తంగా 3,54,77,554 మందిని సర్వేచేశామని చెప్పారు.

సర్వేలో పాల్గొననివారికి మైక్ ఇవ్వొద్దు: రేవంత్‌రెడ్డి

కులగణన సర్వేలో పాల్గొననివారికి శాసనసభలో మాట్లాడేందుకు మైక్ ఇవ్వవద్దని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వే తప్పులతడకగా ఉన్నదని మాజీ మంత్రి కేటీఆర్ గణాంకాలతో సహ వివరించడం, బీజేపీ ఎమ్మెల్యేలు సైతం సర్వే నివేదికను తప్పుబట్టడంతో సీఎం అసహనానికి గురయ్యారు. కేటీఆర్‌ను అడ్డుకునేందుకు కొత్తరాగం ఎత్తుకున్నారు. సర్వేలో పాల్గొననివారిని శిక్షించాలని స్పీకర్‌ను కోరారు. 'సర్వేలో పాల్గొన్నవారికి మాత్రమే మైక్ ఇవ్వండి. సర్వేలో పాల్గొననివారికి మాట్లాడే అర్హత లేదు, వారికి మైక్ ఇవ్వకండి' అని సభ్యులందరి తరపున కోరుతున్నట్టు చెప్పారు. సీఎం వ్యాఖ్యలపై రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది సర్వేలో పాల్గొనలేదని, మరి వాళ్లందరినీ శిక్షిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. సర్వేలో పాల్గొనడం, వివరాలు ఇవ్వడం అంతా స్వచ్ఛందమని గతంలో ప్రభుత్వం, మంత్రులు ప్రచారం చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. దీంతో ఇష్టం ఉన్నవారు స్వచ్ఛందంగా వివరాలు ఇచ్చారని, ఇష్టం లేనివారు వివరాలు ఇవ్వలేదని అంటున్నారు. వివరాలు ఇవ్వకపోతే శిక్షిస్తామని ముందే ఎందుకు చెప్పలేదని ప్రశ్నిస్తున్నారు.

సామాజికవర్గాల వారీగా సర్వే వివరాలు..

- ఎస్సీలు 61,84,319 మంది ఉండగా, మొత్తం జనాభాలో 17.43శాతం
- ఎస్టీ జనాభా 37,05,929 కాగా, వీరి వాటా రాష్ట్ర జనాభాలో 10.45శాతం
- బీసీలు (ముస్లిం మైనార్టీ మినహా) 1,64,09,179 ఉండగా, మొత్తం జనాభాలో 46.25శాతం
- ముస్లిం మైనార్టీ మొత్తం జనాభా 44,57,012 కాగా, రాష్ట్ర జనాభాలో 12.56 శాతం.
- ముస్లిం మైనార్టీల్లో బీసీలు 35,76,588 ఉండగా జనాభాలో వీరి సంఖ్య 10.08శాతం.
- ఓసీల జనాభా మొత్తం 56,01,539 ఉండగా, జనాభాలో 15.79శాతం
- ముస్లిం మైనార్టీలు మినహా ఓసీలు రాష్ట్రంలో 47,21,115 శాతమున్నారు. మొత్తం జనాభాలో వీరి వాటా 13.31శాతం.

హైదరాబాద్ బేగంపేట హరిత ప్లాజాలో మంగళవారం జరిగిన సదస్సులో కులగణన నివేదిక ప్రతులను చించివేస్తున్న బీసీ సంఘాల ప్రతినిధులు. చిత్రంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, జూలూరు గౌరీశంకర్ తదితరులు

బీసీలే కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తరు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్
- బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపారని కులగణన నివేదిక ప్రతులు చింపి నిరసన
- 48 గంటల్లో సరిదిద్ది పూర్తి వివరాలను పబ్లిక్ డొమెయిన్‌లో పెట్టాలని బీసీ నేతల డిమాండ్
- భవిష్యత్తు కార్యాచరణపై 6న సమావేశం అవుతామని వెల్లడి

అమీర్‌పేట్, ఫిబ్రవరి 4 : కులగణన పేరుతో బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తే.. గద్దెనెక్కేందుకు దోహదపడ్డ బీసీలే కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తరని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కులగణనలో తగిన ప్రామాణికాలు పాటించలేదని, ఫలితంగా బీసీల సంఖ్య తప్పులతడకగా వచ్చిందని, ఈ విషయాన్ని గత సెన్సస్ వివరాలతో పోల్చితే స్పష్టంగా తెలుస్తుందని విమర్శించారు. బీసీ కులగణన నివేదికలో ఊహించని విధంగా దొర్లిన తప్పిదాలను 48 గంటల్లో సరిదిద్ది, సరి చేసిన నివేదిక వివరాలను పబ్లిక్ డొమెయిన్‌లో పెట్టి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ మేరకు రిజర్వేషన్లను అమల్లోకి తీసుకువాల్సిందేనని డిమాండ్ చేశారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో వివిధ బీసీ సంఘాలు, మేధావులతో కలిసి మంగళవారం బేగంపేట్‌లోని హోటల్ హరితప్లాజాలో బీసీ సంఘాల సదస్సులో తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘాల జేఏసీ అధ్యక్షులు కుందారం గణేశ్ చారి, బీసీ నాయకులు బాలరాజుగౌడ్ సహ వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. కులగణనలో బీసీలను తక్కువ చేసి చూపించడంతో బీసీ బిడ్డలు ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కులగణనలో వాస్తవ వివరాలను వెల్లడించేందుకు కాంగ్రెస్ జంకుతున్నదని పేర్కొన్నారు. గతంలో నెహ్రూ కాంగ్రెస్ బీసీలకు చేసిన అన్యాయాన్ని, రాహుల్ కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా చక్కదిద్దుతున్నదని భావించామని, అయితే రెడ్డి మార్క్ డీఎన్ఏ నుంచి ఇంకా బయటపడలేదనే విషయం స్పష్టమవుతున్నదని విమర్శించారు. బీహార్‌లో జరిగిన విధంగా బీసీల కులగణన జరిగేందుకు వీలుగా బీసీ మేధావులు చేసిన సూచనలు, సలహాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఒక రాష్ట్రంలోనే బీసీల కులగణన చేయలేకపోతున్న కాంగ్రెస్, ఇక దేశవ్యాప్తంగా ఏం చేస్తుందని ప్రశ్నించారు. బీసీ కులగణనలో దొర్లిన తప్పులను సరిచేయని పక్షంలో ఈ నెల 6న బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహిస్తామని, ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని జాజుల వెల్లడించారు.

నివేదిక ప్రతుల చింపివేత..

సదస్సులో భాగంగా తప్పుల తడకగా ఉన్న బీసీ కులగణన సర్వే ప్రతులను చింపివేసి బీసీ ప్రతినిధులు నిరసన వ్యక్తంచేశారు. బీసీ కులగణన చేపట్టిన విధానమే తప్పుల తడకగా మారిందని, తొలుత జీవోలతో, ఆ తరువాత కమిషన్ల నియామకాలతో కులగణనలో బీసీ కుటుంబాల సంఖ్యను నిర్దిష్టంగా తేల్చలేదని, సంచార జాతులను పరిగణలోకి తీసుకోలేదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ మంత్రిది సమాచార లోపం : వకుళాభరణం

బీసీ సంక్షేమ మంత్రి పొన్నంతో కలిసి తాను పాల్గొన్న ఓ సమావేశంలో.. కులగణన సర్వేలో పాల్గొనని వారికి తమ అభిప్రాయాలు చెప్పే అధికారం లేదంటూ మంత్రి మాట్లాడడం సరికాదని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. ఒక రాష్ట్రానికి బీసీ కమిషన్ చైర్మన్‌గా చేసిన తన ఇంటికే సర్వే నిర్వహిస్తున్న ప్రతినిధులు రాలేదని, తానే జోనల్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసిన తరువాతే తన ఇంటికి సంబంధిచిన సర్వే జరిగిందని తెలిపారు. తనకే ఇలాంటి పరిస్థితి ఉంటే, ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చని తెలిపారు.

బీసీ కోటా ఓవర్ టు ఢిల్లీ!

▸ మొదటిపేజీ తరువాయి...

కల్పిస్తామంటూ కొత్తపాట పాడుతున్నది. ఈ విషయాన్ని మంగళవారం అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. ఇటీవల నిర్వహించిన ఇంటింటి సర్వే నివేదికను అసెంబ్లీకి నివేదించింది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీల వారీగా లెక్కల వెల్లడించింది. ఆ తీర్మానంపై చర్చ సందర్భంగా త్వరలోనే బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పిస్తుందని, దానిపైనా అసెంబ్లీలో తీర్మానం చేస్తామని సర్కారు వెల్లడించింది. ఆ తీర్మానాన్ని కేంద్రానికి పంపిస్తామని, కేంద్రం ఆమోదించి అనుమతిస్తే బీసీ రిజర్వేషన్లను పెంచి అమలు చేస్తామని, లేదంటే పార్టీ పరంగా అమలు చేస్తామని ప్రకటించింది. తెలంగాణ ఏర్పాటు అనంతరం రాష్ట్ర సర్కారు అనేక తీర్మానాలు చేసి పంపినా ఒక్కదానికీ జవాబివ్వని కేంద్రంపైకి నెపం నెట్టేందుకు సిద్ధమైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రిజర్వేషన్లపై మాటమార్చుతుందని 'నమస్తే తెలంగాణ' మొదటినుంచీ చెప్తున్నది. బీఆర్ఎస్ పార్టీ కూడా ఇదే విషయాన్ని ఎక్కడికక్కడ ఎండగడుతూనే ఉన్నది.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇలా

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం నామమాత్రంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే రిజర్వేషన్లు కల్పిస్తూ వస్తున్నాయి. గతంలో లాటరీ పద్ధతిలో, ర్యాండమ్‌గా ఎంపిక చేసే తదితర అశాస్త్రీయ పద్ధతుల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ వస్తుండగా ప్రతిసారీ వాటిపై న్యాయ వివాదాలు తలెత్తడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలోనే ఓబీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లపై కర్ణాటకకు చెందిన కే కృష్ణమూర్తి, మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవాళి కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. ట్రిపుల్ టీ పేరిట మార్గదర్శకాలు ఇచ్చింది. మొదటిది ప్రతి స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు పూర్తిస్థాయి రాజ్యాంగబద్ధమైన, డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. రెండోది జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లను స్థిరీకరించాలి. మూడోది రిజర్వేషన్లు కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి మొత్తంగా 50 శాతం మేరకు మించకూడదు. వాటినే ట్రిపుల్ టీ అంటారు. ఆ మార్గదర్శకాలు పాటించని ఏ రాష్ట్రంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా తేల్చిచెప్పింది. ఆ నిబంధనలను పాటించని గుజరాత్, మహారాష్ట్రతోపాటు పలు రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను కూడా దేశ అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. సిఫారసులు లేకుంటే బీసీ రిజర్వేషన్ స్థానాలన్నింటినీ జనరల్ స్థానాలుగానే మార్చాలని కూడా వెల్లడించింది.

మొదటినుంచీ కాంగ్రెస్ చిత్తశుద్ధి లేమి

సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం అసాధ్యమని తెలిసిపోతున్నది. అయితే మార్గదర్శకాలను అనుసరించి ప్రామాణికమైన, శాస్త్రీయపద్ధతిలో బీసీ జనాభా లెక్కలను సేకరించి, కేంద్రానికి, సుప్రీంకోర్టుకు నివేదించి ఆ దిశగా కృషి చేయాల్సి ఉన్నది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిబంధనలను తుంగలో తొక్కింది. ఇష్టారీతిన, కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని హడావుడి నిర్ణయాలు తీసుకుంటూ నిబంధనలను రూపొందించి ఆదేశాలు జారీ చేస్తూ వచ్చింది. జనగణన 1948 చట్టం ప్రకారం జనగణన, కులగణన చేపట్టే అధికారం కేవలం కేంద్రానికే ఉన్నది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వాలు చేసినా ఆ గణాంకాలకు చట్టబద్ధత ఉండకపోవడమేగాక, అమలు చేసే అవకాశం కూడా లేదు. ఇటీవల బీహార్ సర్కారు నిర్వహించిన కులగణన కోర్టుకెక్కడమే నిదర్శనం. దీంతో ఆ రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలు మొదటికి వచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశించినా బీహార్ ప్రభుత్వం తన సర్వే నివేదికను వెల్లడించకపోవడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లోభాగంగా బీసీ కులగణన చేపడతామని, రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని రేవంత్‌రెడ్డి ఘంటాపథంగా ప్రకటించారు. ఎన్నికల అనంతరం కూడా పదే పదే ఇదే విషయాన్ని చెప్పుకొచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ముందు కులగణన అంటూ హడావుడి చేశారు. చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి చివరికి అసెంబ్లీలో తీర్మానం చేసి తన మోసపూరిత వైఖరిని కాంగ్రెస్ బయటపెట్టుకున్నది. ఆ తర్వాతనైనా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కులగణనకే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వే అంటే ఒకరకంగా జనగణన నిర్వహించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. అంతేకాకుండా ఆ బాధ్యతలను నిబంధనలకు విరుద్ధంగా బీసీ కమిషన్‌కు తొలుత అప్పగించింది. పలువురు బీసీ నేతలు దీనిపై హైకోర్టును ఆశ్రయించడం, కోర్టు ఆదేశాలతో అప్పటికప్పుడు ఎంక్వైరీస్ ఆఫ్ కమిషన్ యాక్టు కింద డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. సర్వే మాత్రం ప్లానింగ్ విభాగం ద్వారా చేయించింది. డెడికేటెడ్ కమిషన్ నివేదికపై తీర్మానం చేసి కేంద్రం ఒప్పుకొంటే అమలు చేస్తామని, లేదంటే పార్టీపరంగా కల్పిస్తామని మాట మార్చింది. దీనిపై బీసీ సంఘాలు, మేధావులు మండిపడుతున్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అదీ బీసీ ఉపకులాల వారీగా కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సర్కారుకు అల్టిమేటం జారీ చేస్తున్నారు. పార్టీ పరంగానే రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పూనుకుంటే తీవ్రస్థాయిలో పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

కేంద్రం ఇవ్వదని తెలిసీ..

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కులగణన అంటూ హడావుడి చేసి రిజర్వేషన్ల పెంపు అంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేసింది. కేంద్రం ఎట్లాగూ అంగీకరించదని తెలిసీ దానిపై నెపం మోపేందుకు సిద్ధమైందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక తీర్మానాలు చేసి పంపింది. కులగణన నిర్వహించాలని, ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని తీర్మానించింది. ఎస్టీ రిజర్వేషన్లను కూడా పెంచుతూ తీర్మానించి పంపింది. అవేగాకుండా ఇతర అనేక అంశాలపై పదేళ్లలో లెక్కకు మించి తీర్మానాలు చేసింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కదానిపైనా రాష్ట్ర సర్కారుకు జవాబివ్వలేదు. తెలంగాణ పంపిన తీర్మానాలను ఆమోదించలేదు. అదీగాక రిజర్వేషన్లనే వ్యతిరేకిస్తున్న బీజేపీ సర్కారు, దీనికి ఒప్పుకొనే అవకాశమేలేదు. ఇదే విషయాన్ని రాజకీయ విశ్లేషకులు వివరిస్తున్నారు. అయినా తీర్మానాన్ని కేంద్రానికి పంపి ఆమోదిస్తే అమలు చేస్తాం, లేదంటే పార్టీ పరంగా రిజర్వేషన్లు కల్పిస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించడంలోనే కుట్ర తేటతెల్లమైందని చెప్తున్నారు. బీసీ రిజర్వేషన్ల హామీని తుంగలో తొక్కి ఆ నెపాన్ని కేంద్రంపై మోపేందుకే కొత్తనాటానికి తెరతీసిందని విమర్శిస్తున్నారు.

ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ప్రధానంగా ఓటరు జాబితా ఆధారంగా బీసీల రిజర్వేషన్లను స్థిరీకరించాయి. మహారాష్ట్ర సైతం అదేబాటలో కొనసాగుతున్నది. ఇక బీహార్, కర్ణాటక రాష్ట్రాలు మాత్రం సమగ్ర కులసర్వేలను నిర్వహించాయి. వాటి ఆధారంగా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించేందుకు కసరత్తు చేస్తున్నాయి. అయితే ఒడిశా ప్రభుత్వం మాత్రం కమిషన్ ఏర్పాటు చేయకుండా, బీసీ రిజర్వేషన్లను మొత్తంగా రద్దు చేసి, వాటన్నింటినీ జనరల్ స్థానాలుగా మార్చింది. బీసీలకు పార్టీ పరంగా 50 శాతం టిక్కెట్లు కేటాయించింది. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ సర్కార్ అదే ఎత్తుగడ అమలు చేసేందుకు సిద్ధమవుతున్నదని 'నమస్తే తెలంగాణ' ముందునుంచే చెప్తూవస్తున్నది. ప్రామాణికమైన డాటా లేకుండా డెడికేటెడ్ కమిషన్ సిఫారసులు చెల్లబోవని, ఈ నేపథ్యంలో ఒడిశా తరహాలోనే పార్టీ పరంగా టిక్కెట్లు కేటాయించి, తద్వారా 42 శాతం హామీని అమలు చేయాలని కాంగ్రెస్ చూస్తున్నదని ఆదినుంచీ చెప్తున్నది. అందుకు తగ్గినట్టుగానే కాంగ్రెస్ ప్రకటన చేయడం గమనార్హం.



అసెంబ్లీ మీటింగ్ జరుగుతుండగా ఎంసీఆర్‌హెచ్ఆర్డీఐలో ఉన్న ఎస్‌కేఎస్ డాటా



ఆ వెంటనే అదే వెబ్‌సైట్‌లో ఎస్‌కేఎస్ డాటా తొలగింపుతో కనిపిస్తున్న ఎర్రర్

ఎస్కేఎస్ నివేదిక ఎక్కడుందో తెలియదు!

- అసెంబ్లీ చిట్‌చాట్‌లో రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే (ఎస్కేఎస్)ను ఎవరు చేశారో? ఎలా చేశారో? ఆ నివేదిక ఎక్కడ పెట్టారో? తనకు తెలియదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. మంగళవారం క్యాబినెట్ సమావేశం ముగిసిన తర్వాత అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. రాష్ట్రంలోని 56% బీసీలు, 17.5% ఎస్సీల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నట్టు చెప్పారు. కులగణన, ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ నుంచే రోడ్‌మ్యాప్ ఇస్తున్నామని, ఈ అంశంలో ప్రధానిపై కూడా ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. పార్టీలు, కుల సంఘాలు చెప్పే జనాభా శాతానికి ఆధారాలు లేవని, అవన్నీ కలుపుకుంటూ వెళ్తే జనాభా 200% దాటుతుందని చెప్పుకొచ్చారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం తీర్పు, మంత్రివర్గ ఉపసంఘం, ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం వెళ్తామని చెప్పారు. రెండు గంటలకు పైగా కొనసాగిన మంత్రివర్గ సమావేశంలో కులగణన సర్వే నివేదిక, వర్గీకరణపై ఎస్సీ కమిషన్ నివేదికను ఆమోదించారు.

ఎంసీఆర్‌హెచ్చార్డీఐ సైట్‌లో ఎస్‌కేఎస్ వివరాలు తొలగింపు

బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికను ఎంసీఆర్‌హెచ్చార్డీఐ వెబ్‌సైట్ నుంచి ప్రభుత్వం తొలిగించింది. ఎస్కేఎస్ డాటాకు, తాజా లగణన సర్వేకు పొంతన లేదు. అప్పటికీ, ఇప్పటికీ జనాభా తగ్గినట్టు వెల్లడైంది. ఇదే అంశంపై కేటీఆర్ అసెంబ్లీలో నిలదీశారు. దీంతో అప్పటివరకు ఎస్కేఎస్‌ను గుర్తించబోమంటూ చెప్పుకొచ్చిన సీఎం రేవంత్ ఎస్కేఎస్ నివేదికను తెప్పించుకొని తాజా కులగణనతో పోల్చారు. ఎస్కేఎస్ డాటా ప్రభుత్వ వెబ్‌సైట్లలో లేదని బుకాయించారు. కానీ ఎంసీఆర్‌హెచ్చార్డీఐ సైట్‌లో ఉన్నదని తేలింది. కొద్దిసేపటికే ఆ సైట్ నుంచి నివేదికను తొలిగించారు. 'కాంగ్రెస్ అబద్ధాలను కేటీఆర్ ఎండగట్టగానే అధికారిక వెబ్‌సైట్ నుంచి ఎస్కేఎస్ నివేదికను తొలిగించారు' అంటూ బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ట్వీట్ చేశారు. దీనిని కేటీఆర్ రీట్వీట్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుత ప్రదర్శన అంటూ ఎద్దేవా చేశారు.

మేమింకా ప్రిపేర్ కాలేదు సార్!

▸ మొదటిపేజీ తరువాయి...

పార్టీల సభ్యులు, అధికారులు, మీడియా ఇలా అందరూ టంచనుగా అసెంబ్లీకి చేరుకున్నారు. ఉదయం 11 గంటలకు సభాపతి ప్రసాద్ కుమార్ సభను ప్రారంభించారు. ఆ సమయానికి సభలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాత్రమే ఉన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులెవరూ లేరు. జాతీయ గీతాలాపన ముగిసిన వెంటనే మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. 'మేము సిద్ధంగా లేము.. క్యాబినెట్ సమావేశం ఇంకా పూర్తి కాలేదు. కొద్దిగా సమయం పడుతుంది. దాని తర్వాత మినట్స్, నోట్స్ ప్రిపరేషన్‌కు సమయం పడుతుంది. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులంతా క్యాబినెట్ సమావేశంలోనే ఉన్నారు. కాబట్టి సభను కాసేపు వాయిదా వేయండి' అని కోరారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్టు చెప్పారు.

నిరసన తెలిపిన బీఆర్ఎస్

సభ మొదలైన రెండు నిమిషాల్లోనే వాయిదా వేయడంపై బీఆర్ఎస్ నిరసన తెలిపింది. అధికార పార్టీ విజ్ఞప్తి చేయడం, సభను వాయిదా వేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, కౌశిక్‌రెడ్డి తదితరుల బృందం స్పీకర్‌ను కలిసింది. తామంతా సభా సమయానికే వచ్చామని వారు గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రిపేర్‌గా లేకపోవడం, సభను వాయిదా వేయాలనడం సరికాదని తమ అభ్యంతరాన్ని స్పీకర్‌కు చెప్పారు. అనంతరం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్కమాట కూడా మాట్లాడకుండానే నిమిషంలోనే అసెంబ్లీని వాయిదా వేయడం ఆశ్చర్యానికి గురిచేసింది' అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఉమ్మడి ఏపీ చరిత్రలో కూడా ఇలా జరుగలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేష్టలతో తెలంగాణ రాష్ట్రం, శాసనసభ పరువు పోయిందని మండిపడ్డారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చే గౌరవం ఇదేనా? సభ్యులను 11 గంటలకు రమ్మని సభ వాయిదా వేశారు. ఇదేనా బీసీలకు ఇచ్చే గౌరవం?' అని మాజీ మంత్రి గంగుల కమలాకర్ నిలదీశారు. శాసనసభ రూల్స్, ప్రొసీజర్స్‌ను తుంగలో తొక్కారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మండిపడ్డారు. సభను వాయిదా వేయటం కుట్ర పూరితమని, సభను ఒక్కరోజే నిర్వహించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో భేటీ అయిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, కౌశిక్‌రెడ్డి, కోవ లక్ష్మి, మాగంటి, లక్ష్మారెడ్డి, ప్రభాకర్

సీఎం, మంత్రుల ఆలస్యం

బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలపై చర్చించేందుకు, ప్రభుత్వం తరఫున శాసనసభలో స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మంత్రివర్గ సమావేశం నిర్వహించాల్సి ఉన్నది. కానీ.. దాదాపు 40 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. అందరికీ ఉదయం 10 గంటలకే అని చెప్పారు. కానీ, ఆ సమయానికి సీఎం సహా సగం మంది మంత్రులు అసెంబ్లీకే రాలేదు. అందరూ ఆలస్యంగా రావడంతో ఉదయం 10.40 గంటలకు మంత్రివర్గ సమావేశం ప్రారంభమైంది. ఈ ప్రభావం శాసనసభ సమావేశంపై పడింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు మంత్రివర్గ సమావేశం కొనసాగింది. మంత్రివర్గ సమావేశం ఆలస్యం కావడంతో శాసనసభ తిరిగి ప్రారంభమవ్వడం కూడా ఆలస్యమైంది. మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి సభ మొదలవుతుందని చెప్పినా 2.20 గంటలకు తిరిగి ప్రారంభమైంది. ఫలితంగా సభ నడవడం కూడా ఆలస్యమై రాత్రి వరకు కొనసాగింది.

ప్రభుత్వంపై ఎమ్మెల్యేల అసంతృప్తి

ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన శాసనసభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదాపడడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన అధికార, విపక్ష ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. అసలు ప్రిపేర్ కాని వాళ్లు ఇంత హడావుడిగా సభ ఎందుకు పెట్టారని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. మంత్రివర్గ సమావేశాన్ని ఒక రోజు పెట్టుకొని మరుసటి రోజు శాసనసభ సమావేశాన్ని ఏర్పాటు చేస్తే బాగుండేదని, అంతా హడావుడి, గందరగోళమేనని, కులగణన సర్వే కూడా ఇలాగా చేశారని మరో ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఇంత ఆదరాబాదరా ఎందుకు చేశారని, ఉదయం వచ్చిన ఎమ్మెల్యేల్లో సగం మంది మధ్యాహ్నం రాలేదని, చర్చ అర్థవంతంగా సాగలేదని కాంగ్రెస్ పార్టీకే చెందిన మరో ఎమ్మెల్యే అన్నారు.

సగం మంది ఎమ్మెల్యేలు డుమ్మా

శాసనసభ సమావేశాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటం, ప్రభుత్వంలో నిర్వహణ లోపం ఉండటంతో విసిగిపోయిన ఎమ్మెల్యేల్లో ఉదయం వచ్చిన వారిలో సగం మంది మధ్యాహ్నం సభకు గైర్హాజరయ్యారు. ప్రభుత్వం మొక్కుబడిగా, తూతూమంత్రంగా సభ పెట్టిందని, నాన్ సీరియస్‌గా ఉన్నదన్న అభిప్రాయాలను శాసనసభ లాబీల్లో ఎమ్మెల్యేలు వ్యక్తంచేశారు.

బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

'బీఆర్ఎస్ తరఫున 38 మంది సభ్యులం ఉన్నం. బీసీ వర్గాల నుంచి కమలాకర్, వివేక్, చింతా ప్రభాకర్, కాలేరు వెంకటేశ్ తదితర సభ్యులు ఈ అంశంపై సభలో మాట్లాడేందుకు సిద్ధమైనా వారికి అవకాశం ఇవ్వలేదు. తమ ఆవేదన చెప్పుకొందామని వారు అనుకున్నారు. సర్వేలో బీసీల సంఖ్య తగ్గిందని వారు ఆందోళన చెందుతున్నారు. ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తూనే బీసీల విషయంలో ఏదైతే కాంగ్రెస్ దగా చేసిందో, 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని బీసీల గొంతు కోసిందో, 51 శాతం నుంచి 5 శాతం జనాభా తగ్గించి చూపిందో, బీసీల విషయంలో మోసాన్ని, దగాను నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం' అని కేటీఆర్ పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.




బీఆర్ఎస్ విప్‌ల నియామకం

మండలి విప్‌గా సత్యవతి రాథోడ్

అసెంబ్లీలో కేపీ వివేకానందగౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): శాసనమండలి, శాసనసభలో బీఆర్ఎస్ విప్‌లను పార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. మండలి విప్‌గా ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, శాసనసభ విప్‌గా ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్‌ను బీఆర్ఎస్ఎల్పీ పక్షాన ఎంపిక చేసినట్టు కేసీఆర్ శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్‌కు లేఖలు రాశారు. ఆ లేఖలను మంగళవారం అందజేశారు.

నా ఇంట్లో కేసీఆర్ ఫొటో ఉంటే తప్పేంది? : దానం

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): తన ఇంట్లో కేసీఆర్, వైఎస్సార్ ఫొటోలుంటే తప్పేందని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. ప్రజల పక్షాన పోరాడే విషయంలో తగ్గేది లేదని, వైఎస్సార్ హయాంలో అధికారులతో కాంప్రమైజ్ కాలేదని, ఇప్పుడు హైడ్రా విషయంలోనూ తగ్గేదిలేదని తేల్చిచెప్పారు.



ఇంకెప్పుడు ప్రిపేరవుతరు?

2 నిమిషాలకే సభ వాయిదానా?

అధికారంలో ఉన్నా ప్రిపేర్ కాలేరా?

మాజీ మంత్రి హరీశ్‌రావు చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ప్రారంభమైన రెండు నిమిషాలకే వాయిదా వేయటం ఏమిటని మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఎక్స్‌వేదికగా నిలదీశారు. క్యాబినెట్ సమావేశం ఇంకా కొనసాగుతున్నదని, సబ్జెక్టు నోట్స్ సిద్ధం చేయలేదని సభను వాయిదా వేయాలని మంత్రి శ్రీధర్‌బాబు కోరడం హాస్యాస్పదంగా ఉన్నదని పేర్కొన్నారు. 'నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ ప్రిపేర్ కాలేదు. నేడు పాలక పక్షంలో ఉన్నా ప్రిపేర్ కాలేదు. ఇంకెప్పుడు ప్రిపేరవుతరు?' అని చురకలంటించారు.